క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి రూరల్‌లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీటీ రోడ్డు తూర్పు వైపు అనగానులక పేట 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నుంచి శర్మ దాబా వరకు, ప్రకాష్ నగర్, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ లేన్ల అత్యవసర మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. వినియోగదారులకు సహకరించాలని పేర్కొన్నారు.

నేడు స్వచ్ఛత దివస్

తాడేపల్లిరూరల్: మంగళగిరి, తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలో శనివారం నిర్వహించనున్న స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు మహానాడు, ఆత్మకూరు, ఉండవల్లి, 10 గంటలకు గాలిగోపురం నుంచి మిద్దె సెంటర్ వరకు డ్రెయిన్ క్లీనింగ్, డెబ్రిస్ తొలగింపు, బ్లీచింగ్, దోమల నివారణ, మొక్కల పెంపకం, స్వీపింగ్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు స్వచ్ఛభారత్ ర్యాలీ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం నుంచి శివాలయం సెంటర్ వరకు అవగాహన ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

ఆరోగ్య పింఛన్ల తనిఖీ



ఫిరంగిపురం: మండలంలోని 8 గ్రామాల్లో ఆరోగ్య సంబంధిత పింఛన్లను జిల్లా స్థాయి అధికారులు శుక్రవారం తనిఖీ చేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, మునగపాడు, మేరికపూడి, కండ్రిక, వేమవరం, నుదురుపాడు గ్రామాల్లోని 29 మంది పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి సదరన్ సర్టిఫికెట్లు పరిశీలించారు. ఆరోగ్య సమస్యలు, వాడుతున్న మందులు, ప్రస్తుత వాస్తవ పరిస్థితి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది వారి వెంట ఉన్నారు.

స్వప్రయోజనాల కోసమే కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



బాధితులతో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: వ్యక్తుల స్వప్రయోజనాల కోసం పనిచేసేది కూటమి ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు విమర్శించారు. పొనుగుపాడు గ్రామంలో ఇటీవల చర్చి గోడను కొందరు కూటమి ప్రభుత్వం అండతో అధికారుల సమక్షంలో పగలగొట్టారు. బాధితులను శుక్రవారం వనమా బాల వజ్రబాబు పరామర్శించారు. చర్చి వద్ద గోడ పగలగొట్టిన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక దళిత మహిళలతో మాట్లాడారు. పడగొట్టవొద్దని అధికారులను వేడుకున్నా పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాల వజ్రబాబు మాట్లాడుతూ 1903లో హిందు, ముస్లిం, క్రైస్తవులకు స్థలం కేటాయించారని తెలిపారు. క్రైస్తవులకు ఇచ్చిన స్థలంలో ఆర్సీఎం చర్చిని దళితులు నిర్మించుకున్నారని చెప్పారు. అన్యాక్రాంతం కాకుండా నిర్మించిన గోడను కూటమి ప్రభుత్వం అండతో ఏకపక్షంగా కొందరు కూల్చివేయడం దారుణమన్నారు. దీని ద్వారా బడుగు, బలహీన వర్గాల వారి మనోభావాలు దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. న్యాయ పరిధిలోకి వెళ్లకుండా కూటమి ప్రభుత్వం అండతో మూకుమ్మడిగా ఎదురు తిరిగిన వారిని స్టేషన్‌లో ఉంచి గోడను దౌర్జన్యంగా కూల్చివేసారని తెలిపారు. పేదల కష్టాలను పట్టించుకునేది వైఎస్సార్ సీపీ మాత్రమేనని, దీనిపై న్యాయపరంగా వ్యవహరిస్తామన్నారు. కూటమి ప్రభుత్వ అండతో కొందరు పోలీసు, రెవెన్యూ, ఇతరశాఖల వారిని అడ్డుపెట్టుకొని అరాచకాలు సృష్టిస్తున్నారని వజ్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, గేరా కోటేశ్వరరావు, సేవా నాగరాజు, చేవూరి రామమోహన్‌రెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, పి.చిన్నా, డి.మెల్కియా, మంజుల. ఖాజావలి, షేక్ ఖాసిం షాహిద్, పి. వెంకట్రామిరెడ్డి, ఇ.పూర్ణారెడ్డి, ఒ.పిచ్చిరెడ్డి, బి.అంజిరెడ్డి, ఎం.జోజిబాబు, టి.కృష్ణ పాల్గొన్నారు.



మంచు దుప్పట్లో మంగళగిరి

తాడేపల్లిరూరల్ : వారం నుంచి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. చలి తీవ్రత, పొగ మంచు పెరిగిపోతున్నాయి. మంగళగిరి పట్టణంపై చలి పంజా విసురుతోంది. అర్ధరాత్రి నుంచి ఉదయం 9 గంటల వరకు పట్టణ మంతా మంచు ముసుగులోనే ఉంటోంది. కొంత దూరంలో ఉన్న వారు కూడా కనిపించనంత దట్టంగా పొగమంచు కమ్ముతోంది. మంగళగిరి కొండ ప్రాంతం కావడంతో మంచు ప్రభావం ఎక్కువగా ఉంది. మంగళగిరి మెయిన్ బజార్, జాతీయ రహదారి, ఎయిమ్స్ రోడ్డు, కొండ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తోంది.



చేతుల శుభ్రతతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: గొల్లపాలెం గ్రామంలో శుక్రవారం ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. బఫర్ వైద్యురాలు అశ్రిఫ్ 172 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలిలో చిన్నారులు, గర్భిణులు ఎక్కువ సేపు తిరగకుండా చూసుకోవాలని చెప్పారు. ఆహారం తీసుకునే ముందు, తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొన్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు నుంచి ఐరన్ లోడుతో బెంగుళూరు వెళ్తున్న లారీ ఫిరంగిపురం బస్టాండు సెంటర్‌లో ఎదురుగా ఉన్న డివైడర్ ఢీకొట్టి పైకి ఎక్కింది. దీంతో లారీ పూర్తిగా దెబ్బతింది. ఎటువంటి ప్రమాదం జరగలేదు.

శానిటేషన్ వర్కర్స్‌కి అవగాహన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి యానాదుల కాలనీలో శుక్రవారం డాన్ బాస్కో, నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాన్ బాస్కో లెర్నింగ్ సెంటర్ ప్రోగ్రాం మేనేజర్ డి.వసంతకుమారి మాట్లాడుతూ పిల్లలను బడికి పంపాలని, తల్లిదండ్రులు తమ పిల్లలతో రోజులో గంటసేపైనా గడపాలని సూచించారు. వారు ఏం చెబుతున్నారో శ్రద్ధగా వినాలని కోరారు. ఎన్‌కే గొస్య, టీచర్లు ఆశ, పావని, శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలపై అవగాహన

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలంలోని ఈమని గ్రామంలో కౌలు గుర్తింపు కార్డు కలిగిన రైతులకు వ్యవసాయ పంట రుణాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ బ్రాంచ్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి విచ్చేశారు. కౌలు కార్డు కలిగిన రైతులకు వ్యవసాయ రుణాలు అందజేస్తామని తెలిపారు. రూ.లక్ష వరకు వడ్డీ లేని రుణం, రూ.3 లక్షల వరకు పావలా వడ్డీతో రుణాలు ఇస్తామని తెలిపారు. ఇప్పటి వరకు లోన్ తీసుకోని భూ సర్వే నంబర్లపై కౌలు రైతులు రుణం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఏసుబాబు మాట్లాడుతూ 52 ముద్ర గ్రూపుల వరకు ఎన్‌పీఏఐ ఉన్నాయని, వాటిని వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద కేవలం 10 నుంచి 15 శాతం డబ్బులు చెల్లిస్తే క్లియర్ అవుతాయని చెప్పారు. రుణం సకాలంలో చెల్లించాలని కోరారు. ప్రతి కౌలు రైతుకి పంట రుణం ఇప్పించాలని ఎల్‌డీఎంకు విజ్ఞప్తి చేశామని కౌలు రైతు సంఘం అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఏడీఏ ఉషా రాణి, ఏవో శిరష, ఏఈవో రమేష్, వీఆర్‌వో, వీఏఏలు రఫీ, ప్రియాంక పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు


117 మందికి రూ.8.11 లక్షల జరిమానా



తనిఖీ చేస్తున్న ఎస్ఈ సుబ్రహ్మణ్యం తదితరులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం నులకపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఆర్డీఏ సర్కిల్ ఎస్ఈ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నులకపేట ఏక కాలంలో 37 బృందాలు గృహ, వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసినట్లు తెలిపారు. రెండు సర్వీసులకు రూ.33 వేల అదనపు లోడ్ కింద, మరో 117 మంది విద్యుత్ వినియోగదారుల సర్వీస్‌లకు వివిధ కారణాలతో రూ.8,11,000లు అపరాధ రుసుం విధించినట్లు వెల్లడించారు. విద్యుత్ చౌర్యం, అదనపు లోడ్ ఉపయోగించినా, విద్యుత్ మీటర్లకు సీల్ లేకపోయినా తనిఖీ సమయానికి సరిచేసుకోవాలని వినియోగదారులను హెచ్చరించారు. విద్యుత్‌శాఖ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఈఈ సంజీవరావు, మంగళగిరి డీఈఈ సురేష్‌బాబు, కృష్ణనగర్ ఏఈ షణ్ముఖరావు, అమరావతి డివిజన్ ఏఈలు, విజిలెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బ్రహ్మానందపురంలోని ఏసీసీ ఫ్యాక్టరీ కార్మికుల రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. కార్మికుల పట్ల పాలకపక్షానికి నిర్లక్ష్య ధోరణి ఉండకూడదన్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులకు ఎన్నికల వాగ్దానంను స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని కోరారు. కార్మిక పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెల్, తుపాకుల దుర్గ భవాని, ఈదులమూడి శారమ్మ, ఎస్కే మాలిం, నిష, సూర్యప్రకాష్, అంకయ్య, ఆరిఫ్, ఆశీర్వాదం, దానయ్య, గురవయ్య, మాణిక్యాలరావు, సాంబయ్య పాల్గొన్నారు.